కథా నిలయం
181
శ్రీకాకుళం



# అవసరం

ముఖం వేలాడేసుకొని ఇంటికొచ్చిన భర్తను చూసి పరిస్థితినర్థం చేసుకుంది భాగ్య భర్తతో మౌనంగా గదిలోకి నడిచింది. భర్తముఖం లోని ఆవేదనర్థం చేసుకుంది

"ఎందుకండి అంతగా బాధపడతారు. అదే దొరుకుతుంది. ఉద్యోగం మెల్లగా.. ఓదార్చింది భాగ్య.

"ఐదారేళ్ళనుంచి కాలికి బట్టగట్టకుండా తిరుగుతున్నా నాకీ జన్మలో ఉద్యోగం దొరికేయోగం లేనట్టుంది.. అంటూ మంచంలో కూర్చున్నాడు మూర్తి.

"ఎందుకండీ అంత వైరాగ్యం? వెనుకో ముందో అదే దొరుకుతుంది నిరుత్సాహ పడొద్దు అంది భర్త ప్రక్కలో కూచోని ముఖంపై ముఖం పెట్టి భాగ్య.

"నాతోపాటు నిన్ను కూడా కష్టపెడుతున్నాను భాగ్యం. నన్ను చేసుకొని నువ్వేం సుఖపడ్డావు..? అన్నాడు బాధగా మూర్తి.

„ఆలాంటి మాటలనొద్దని మీకెన్ని సార్లు చెప్పాను?నాకిప్పుడేం తక్కువయింది? అని భాగ్య మూర్తిని లెమ్మని భోజనం వడ్డించింది. బుజ్జగిస్తూ భర్తతో అన్నం తినిపించింది చేయికడుక్కొని మంచంలో పడుకున్నాడు మూర్తి. పొద్దంతా తిరిగి అలసిపోయిన మూర్తి తొందరగానే నిద్రలో మునిగిపోయాడు. భర్త ప్రక్కలో పడుకున్న భాగ్యకు నిద్రరావడం లేదు.... లేచి కూర్చొని అమాయకంగా నిద్రపోతున్న భర్త ముఖంపై ముద్దుపెట్టుకుంది. ఆమె దృష్టి మంచం ప్రక్కనే పడివున్న మూర్తి డైరీపై పడ్డది. వద్దనుకుంటూనే డైరీ చేతిలోకి తీసుకుని పేజీలు తిరిగేయసాగింది.

జనవరి 84

"భాగ్య నా జీవితంలోకి ప్రవేశించి సరిగ్గా రెండేళ్ళయింది. ఒక్క రోజు కూడా నోరు విడిచి ఏమీ అడుగలేదు. నిరుద్యోగినైన నాతో ఆమేం సుఖపడ్తుంది? నన్ను సంపూర్ణంగా అర్థం చేసుకుంది అలాంటి భార్య దొరకడం నిజంగా నా అదృష్టమే''

ఫిబ్రవరి... 84

"ఐదేళ్ళపైగా ఉద్యోగం కొరకు తిరిగీ తిరిగీ అలసిపోయాను. ఉద్యోగమొచ్చే సూచనలు కనబడటం లేదు. అమ్మానాన్నలు మిగిల్చిన ఆస్తిపాస్తులేం లేవు. బ్రతికేదెలా?

ఫిబ్రవరి — 84

ఉద్యోగం కొరకు అడ్డమైన వాని కాళ్ళల్లా పట్టుకున్నాను అయినా ఫలితం శూన్యం ఈ నిరుద్యోగ సంద్రంలో ఎంతకాలమని ఈదాలి? దరిజేరడం తన వల్ల కాదా?

మార్చి 84

పైరవీకారిని తీసుకెళ్ళి బ్లాక్ ప్రెసిడెంట్ రాజిరెడ్డిని కలిసాను. ఇంటిముందు గంటల తరబడి ఎదురు చూసాను. పూజలో మునిగున్న తను బయటకు రావడానికి 2 గంటల పైగా పట్టింది. నన్ను చూడగానే ముఖం చిట్లించాడు. తనను విసిగించొద్దని కసురుకున్నాడు. అమర్యాదగా ప్రవర్తించి రేపు రమ్మన్నాడు.

ఈ రోజు మళ్ళీ బ్లాక్ ప్రెసిడెంటు దగ్గరి కెళ్ళాను వెంటొచ్చిన పైరవీకారికి తాగించాను .. తినిపించాను. బ్లాక్ ప్రెసిడెంటు ఉద్యోగాల్లేవు ఇప్పుడు కాదన్నాడు. మూడేళ్ళ క్రితమిచ్చిన నా డబ్బు వాపసివ్వమన్నాను. నన్నే ఉరిమురిమి చూసి కొట్టినంత పని చేశాడు. నీ బిసాయి దెంత? నీ డబ్బు బిసాయిదెంతన్నాడు, తిట్టి పంపించాడు.

ఏప్రిల్ .. 84

"జిల్లా పరిషత్ చుట్టూ మూడేళ్లుగా తిరుగుతూనే వున్నాను. అందులోని కొందరు L D.C లతో పరిచయ మయ్యింది. నేను కనబడగానే హోటల్‌కు లాక్కెళ్లుతారు. డబ్బులేవన్నా వినరు. జేబులు కాలీ చేస్తారు. జేబులో చేతులుపెట్టి ఉన్నదంతా లాక్కుంటారు. కోపంవచ్చినా వాళ్ళ వల్ల ఏదైనా పనిగావచ్చని ఆశ.

జూన్—84

చదువుకోకున్నా బాగుండేది? కూలిపనైనా చేసుకునేవాన్ని. ఇప్పుడదీ చేతగాదు. అమ్మానాన్నలు చనిపోయి సుఖపడ్డారు. ఊళ్లో వున్న కొద్దిపాటి ఆస్తమ్ముకొని ఈ పట్టణానికొచ్చి దాదాపు సంవత్సరమయింది ఉన్న డబ్బంతా ఖర్చయిపోతుంది. భాగ్య ఎంత పొదుపుగా ఖర్చు చేసినా కూర్చొని తింటే ఎంతకాలమని ఆగుతుంది? ఉన్న ఈ 3,4 నెలయిపోతే చిప్పలే గతి—

జూన్—84

పాపం భాగ్యను కష్టపెడుతున్నాను. ఆమె అన్ని కోర్కెలూ అణచుకుంటూ నాతో ఎడ్జస్టవుతుంది. తిరిగీ తిరిగీ ఎంత రాత్రి వచ్చినా చిరునవ్వుతోనే ఆహ్వానిస్తుంది. ఆమె నాకు దేవతే. భాగ్య కళ్ళనుండి బొటా బొటా కన్నీళ్లు కారుతున్నాయి. పేజీలు తిరిగేసింది,

జులై ...84

ఎంప్లాయ్‌మెంటు ఆఫీసు చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరగలేక విసుగస్తుంది. పొద్దునలేస్తే ఇదేవేట. ఈరోజు పద్దెనిమిదో ఇంటర్వ్యూకు అటెండయ్యాను. ఫలితం శూన్యం. నాకున్న డిగ్రీ చదువు బుక్కెడు కూడైనా పెట్టలేకపోతుంది నాలో అన్ని విదాల సహకరిస్తున్న నాభార్యనేలా పోషించాలి? ఛీ ఎంత అసమర్ధపు బ్రతుకు? ఓ బట్టల దుకాణంలో గుమాస్తాగా చేరుతానంటే చదువుకున్నవాళ్ళు వినరు వద్దన్నాడు. ట్యూష

న్ని చెప్పి బ్రతుకుదామన్నా అక్కడా పోటే. ఓ ప్రైవేటు పాఠశాలలో సంప్రదిస్తే నాలుగైదు నెల్ల వరకు వీలుగాదన్నాడు. తుదకో కిరాణా దుకాణంలో నెలకు 200/-చొప్పున నెల రోజుల తర్వాత చేరమన్నాడు, అదీ తాను పదవ తరగతి మాత్రమే చదివానని అబద్ధమాడితే ఆ సేటు ఏలా తిట్టినా పడాలి. ఇక ఆ దుకాణంలో చేరక తప్పేట్టు లేదు.

సెప్టెంబర్...84

మొన్నిచ్చిన ఇంటర్వ్యూలో ఆఫీసర్ కొంత బాగా మాట్లాడాడు ఫలితముంటుందేమోనని ఇంటి కెళ్ళాను. అతడు నిస్సిగ్గుగా కోరాడు... నా రక్తం కుత కుత ఉడికింది. వాన్ని చంపాలన్నంత కోపమొచ్చింది. బలవంతంగా కోపాన్నణచుకొని బయట కొచ్చాను. నా దయనీయ స్థితి నాసరాగా చేసుకొని అంత నీచమైన కోర్కె కోరుతాడా? రాస్కెల్...

ఇక చదువలేక పోయింది భాగ్య. ఆమెకు హృదయంపై సుత్తితో కొట్టినంత బాధ. మనుషుల దిగజారుడు తనాన్నసహ్యించుకుంది. తల నొప్పిగా వుంటే చేతులతో పట్టుకుంది. కొద్దిసేపాగి మళ్ళీ పేజీలు తిరిగే యసాగింది

అక్టోబర్...84

నా పరిస్థితి నాకే బాధాకరంగా వుంది. సేటు దగ్గర 200-/ జీతా నికి చేరాను. ఎన్నో అవమానాల నెదుర్కొంటున్నాను. భాగ్య ఎంత బాధపడుతుందో? నాలాంటి కోట్లాది మంది పరిస్థితి ఈ దేశంలో ఇలాగే వుందేమో, ఒక్కొక్కసారి ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది. కాని నాతో జీవితం ముడిపడ్డ భాగ్యకన్యాయం చేసినట్టవుతుందేమో.

డైరీమూసి కళ్ళవెంట కారుతున్న నీటిని తుడుచుకుంది భాగ్య. భర్త ప్రక్కలో ఒరిగింది భర్త ఇటు పక్కకు కదిలాడు. ఆప్యా యంగా మూర్తిపై చేతులేసి దగ్గరకు తీసుకుంది. ముఖంపై ముద్దు పెట్టు కుంది. రకరకాలుగా ఆలోచించుకొని ఒక స్థిర నిర్ణయానికొచ్చింది

కరెంటాఫీసు నుంచొచ్చిన అపాయింట్ మెంటార్డర్‌ను చూసి ఆశ్చర్య పోయాడు మూర్తి. భార్యకు చూపి సంతోషంగా చెప్పాడు... భార్యను ముద్దులో ముంచాడు. రెండు చేతుల్తో ఎత్తుకొని గిరగిరాతింపాడు తెల్లవారే పోయి డ్యూటీలో చేరాడు .. ఆఫీసర్ గారికి నమస్కరించాడు. తన కృతజ్ఞతలు తెలిపాడు కొద్ది రోజులు గడచాయి. కాని భార్యలో ఏదో మార్పు గమనిస్తున్నాడు మూర్తి .... ఉద్యోగం వచ్చిం తర్వాత సంతోషంగా ఉండటానికి బదులు ఏదో పోగొట్టుకున్న దానిలా ఉంటటం అతనికి బాధాకరంగా వుంది...అతనికి కారణం బోధపడటంలేదు. భార్య నడిగినా చెప్పడంలేదు. ఓ రోజు గాడనిద్రలో నుండి మెలకువొచ్చి భార్యపై చేయివేయపోయేసరికి ప్రక్క ఖాలీగా వుంది. చీకట్లో భార్య కనిపించింది...ఆమె చేతిలో ఏదో పొట్లం. హఠాత్తుగా లేచి స్విచ్ వేసాడు. భాగ్య పొట్లంలోని ట్యాబ్లెట్లను మ్రింగబోతుంది.మూర్తి గబా లున ఆమె చేతిలోనిపొట్లం గుంజుకున్నాడు. అవి నిద్రమాత్రలు భార్య చేస్తున్న ప్రయత్నం అతని కర్థమయింది కడుపునిండా · దుఃఖముతో గుడ్ల నిండా నీళ్ళతో శోకమూర్తిలా వున్న భాగ్యను చేతుల్లోకి తీసుకొని

"ఇదేం పని భాగ్యం? ఏమైంది నీకు? అని ప్రశ్నించాడు మూర్తి... పెల్లుబికి వస్తున్న దుఃకముతో భోరున ఏడ్చింది బాగ్య. ఆమె కన్నీటితో మూర్తి బనీనంత తడిసింది. ఆమె నోదార్చి—

"ఏమైందమ్మా చెప్పు అని బుజ్జగించాడు మూర్తి.

ఇరవై రోజులుగా తనలో తానే కుమిలిపోతూ దాచిన రహస్యం బయటపెట్టడం తప్పలేదు బాగ్యకు.

"ఆరోజు మీ డయిరీ చదివాను....అందులో మీ ఉద్యోగం కొరకై నన్ను కోరిన ఆఫీసర్ సంగతి తెలుసుకున్నాను... ఉద్యోగం లేక మీరు పడుతున్న నరకయాతనను దృష్టిలో వుంచుకున్నాను... నేనేమైనా సరే మీకుద్యోగం రావాలని కోరుకున్నాను. ఆ అఫీసర్ గారికి నా తనువు

నర్పించాను. తత్ఫలితమే మీకు ఉద్యోగం రావడం. కలుషితమయిన శరీరంతో మీకు భార్యగా ఉండలేను నన్ను చావనివ్వండి అని భోరున ఏడ్వసాగింది భాగ్య

భార్య మాటలు విన్న మూర్తికి భూమి బ్రద్దలౌతున్నట్టు తానందు లోకి కూరుకు పోతున్నట్టు తోచింది. అతని కండ్లు చండ్రనిప్పుల య్యాయి .. క్రోధం పెల్లుబికి వచ్చింది. పళ్ళు పటపట కొరికాడు అతని కోపం అలనాడు భర్త ప్రాణాలకై యమున్ని వెంబడించిన సావిత్రిలా తన ఉద్యోగం కోసం తన సర్వస్వాన్నర్పించిన భాగ్యపైకాదు.. తన లాంటి నిరుద్యోగుల నిస్సహాయ పరిస్థితి నాసరగా తీసుకొని నైతిక విలు వలకే తిలోదకాలిస్తూ పశుజాతికంటె హీనంగా ప్రవర్తిస్తున్న అఫీసర్ లాంటి రాక్షసుడిపై బలవంతంగా కోపాన్నణచుకొని ..

"భాగ్యం! చావవల్సింది నీవుకాదు—నీపై చేయేసిన ఆ పంది—నీవు పతితవు కావు నా కోసమే పుట్టిన దేవతవు, అని కత్తి తీసుకొని బయటకు పోబోయాడు మూర్తి

భర్త కాళ్ళను గట్టిగా పెనవేసుకొని అతని ప్రయత్నాన్నాపింది భాగ్య.

సాహిత్య దుందుభి మాసపత్రిక 1985